క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా శాంతిస్వరూపిణి

కాటారం: మండలంలోని గంగారం మోడల్ పాఠశాల, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా జువాలజీ లెక్చరర్ శాంతిస్వరూపిణి నియమితులయ్యారు. ఈ మేరకు మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గత ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కొనసాగిన బానోతు మధు అనారోగ్య కారణాల రీత్యా అదనపు బాధ్యల నుంచి తప్పుకుంటున్నట్లు ఉన్నత అధికారులకు నివేదించారు. దీంతో శాంతిస్వరూపిణికి బాధ్యతలు అప్పగించారు.

అవార్డుకు విద్యార్థి ఎంపిక



మల్హర్: మండలంలోని అన్నాపల్లి గ్రామానికి చెందిన వర్ధమాన నృత్యా కళాకారిని, విద్యార్థిని బానోత్ అలకనంద రాథోడ్‌ను 2024 గౌతమి నంది అవార్డుతో పాటు జాతీయస్థాయి ఐకాన్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 28 హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో జరిగే ప్రదానోత్సవ కార్యాక్రమంలో ప్రముఖల చేతుల మీదుగా అలకనందకు గౌతమి నంద అవార్డు, జాతీయస్థాయి ఐకాన్ అవార్డులను ఆర్ట్సఅండ్‌కల్చర్ ఆకాడమీ వారు అందజేయనున్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: జిల్లాలో ఉద్యాన పంటలైనా కూరగాయలు, ఆయిల్ పామ్, మిర్చి, పండ్ల తోటలు సాగుచేస్తున్న రైతులు పంటల వివరాలను సర్వేనంబర్ వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించి నమోదు చేయించుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమోదైన వివరాల ఆధారంగా రైతులకు భవిష్యత్‌లో ఉద్యాన శాఖ ద్వారా అందించే వివిధ పథకాలు, రాయితీలు నిర్ణయించడానికి అవకాశం ఉంటుందన్నారు. అకాల వర్షాల ద్వారా జరిగే పంట నష్టం, నష్ట పరిహారం అందించేందుకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

ఉద్యోగభద్రత కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్య మిత్రలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు డీపీవో కేడర్ కలిపిస్తూ ఉద్యోగ భద్రత, జీతాలను పెంచాలని కోరారు. ఆరోగ్య మిత్రలకు ఈ కేడర్ కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి జీతాలు పెంచి వారి కుటుంబాలు వీధిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమస్యలు పరిష్కరించుకోవడానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

కళాకారుల ప్రదర్శన



కాటారం: భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, మత్తు పానియాలు, మాదక ద్రవ్యాల నివారణపై సారధి కళాకారులు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కళా ప్రదర్శన ఇచ్చారు. తమ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మూడు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని.. కుటుంబ పోషణ భారంగా మారిందని కళాకారులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కుమార్, బృందం సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇంటి గోడ



పలిమెల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పంకెన గ్రామానికి చెందిన పాగె రాంచందర్ ఇంటి గోడ బుధవారం రాత్రి కూలింది. కుటుంబసభ్యులు అందరూ నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారి గోడ కూలింది. ఎవరికీ గాయాలు కాలేదు. ప్రాణనష్టం జరగకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు రాంచందర్ అధికారులను వేడుకున్నారు.

పరామర్శ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన అబ్బు వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు.

వంతెన కూలి ఏడాది



వంతెనపై పోస్తున్న స్లాబ్



కూలిన వంతెన(ఫైల్)

● కూలిన రోజే స్లాబ్ పునఃనిర్మాణం

టేకుమట్ల: టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగు వంతెన కూలి గురువారానికి (జులై-25, 2023) సంవత్సరం అయింది. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించగా పునఃనిర్మాణ పనులు మొదలై వంతెనపై స్లాబ్ నిర్మాణం కూలి సంవత్సరంమైన రోజునే యాధృచ్చికంగా మొదలైంది.

తాత్కాలిక రోడ్డుతో రవాణా సౌకర్యం..

వంతెన కూలి టేకుమట్ల–రాఘవరెడ్డిపేట మధ్య రవాణా స్తంభించడంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రాల చొరవతో చలివాగులో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి టేకుమట్ల–రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగు పడడంతో వంతెన కూలినా కొంత కాలం పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు కొనసాగాయి. కానీ వర్షాకాలం మొదలవడంతో చలివాగులో వరద ఉధృతి పెరగడంతో చలివాగులో నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డు తెగిపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. రాఘవరెడ్డిపేట నుంచి టేకుమట్ల మండల కేంద్రానికి రావడానికి మండలంలోని రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి, గుమ్మడవెల్లి, కుందనపల్లి, బండపల్లి, ఎంపేడు, మందలోరిపల్లి, దుబ్యాల, వెల్లంపల్లి గ్రామాల ప్రజలకు ప్రయాణ భారం తప్పడం లేదు. టేకుమట్ల మండల కేంద్రానికి రావాలంటే మొగుళ్లపల్లి, చిట్యాల మండల కేంద్రాల మీదుగా సుమారు 25కిలో మీటర్ల మేర అదనపు దూరం రవాణా చేయాల్సి వస్తోంది. వంతెన స్లాబ్ నిర్మాణం ప్రారంభమైనా మరో నెల రోజుల్లో స్లాబ్ నిర్మాణం పూర్తి వంతెనపై రవాణా అందుబాటులోకి రానుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా వంతెన నిర్మాణ పనులు పూర్తవుతుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మడేలయ్య ఉత్సవాలు



బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

భూపాలపల్లి రూరల్: రజక సంఘం ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలో మడేలయ్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రజక మహిళలు గురువారం గణేష్ చౌక్ వద్దనున్న పోచమ్మ గుడి నుంచి బోనాలతో అంబేద్కర్ సెంటర్ మీదుగా మడేలయ్యా గుడి వద్దకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రజకులకు సంబంధించిన దైవం మడేశ్వరని ప్రతి ఆషాఢ మాసంలో రజకులంతా కలిసి పెద్ద ఎత్తున బోనాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. భూపాలపల్లి పట్టణంలో ఉన్న రజకులంతా ఐక్యమత్యంతో ప్రతీ సంవత్సరం ఇలాగే జరుపుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ కౌన్సిలర్లు ముంజంపల్లి మురళి, సమ్మయ్య, మేకల రజిత, మల్లేష్, నాయకులు రాయమల్లు, శ్రీను, వైనాల శోభన్, సతీష్, రాజు, రమేష్, వీరస్వామి, స్వామి, మొగిలి, రాములు, సారయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో ఝాన్సీ లక్ష్మీభాయి మండల సమాఖ్య మిల్లెట్ బేస్‌డ్ ఫుడ్ ప్రొడక్ట్‌లో భాగంగా మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లను గురువారం అధికారులు అందజేశారు. సభ్యులు మిల్లెట్స్‌తో తయారీ చేసిన పదార్థాలు, రాగిలడ్డులు, కేక్‌లు, చిరుధాన్యాల స్వీట్స్, ఖార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నరేష్, నాబార్డ్ ఏజీఎం రవికుమార్, మహదేవపూర్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సీడీపీఓ రాధిక, వెలుగురేఖ ఎన్‌జీఓ సీఈఓ రజిత, ఏపీఎం రవీందర్, సీసీ, ఎంఎస్‌ఈ, వీఓఏలు, శిక్షణ పొందిన మహిళలు ఉన్నారు.

రుణమాఫీతో రైతుల్లో ఆనందం

గణపురం: రుణమాఫీతో రైతులు సంతోషంగా ఉన్నారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ అన్నారు. రుణమాఫీ పొందిన రైతులతో గణపురం మండలం మైలారం గ్రామంలో డీఏఓ గురువారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష రూపాయల రుణమాఫీ జరగడంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రేగొండ(కొత్తపల్లిగోరి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మిరప నారుమడులకు ఎలాంటి తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని భూపాలపల్లి డివిజన్ ఉద్యాన శాఖ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. గురువారం కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లి గ్రామంలోని నారుమడులను పరిశీలించారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మిరప నారుకు వేరుకుళ్లు సోకే ప్రమాదం ఉన్నందున వర్షం నిలిచిన వెంటనే 3గ్రాముల కాపర్ఆక్సిక్లోరైడ్ అనే మందును లీటర్ నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలన్నారు. అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వలన కూరగాయ పంటలలో ఆకుమచ్చ తెగులు సోకకుండా 1 గ్రాము కార్బెండిజము లేదా 1 మిల్లీలీటరు ప్రాపికొనజోల్‌లనే మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లబోయిన రమేశ్, దొంగరి రాజమౌళి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



మిరప నారుమడులను పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

ఆస్పత్రికి సామగ్రి అందజేత

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి గ్రామానికి చెందిన నాగుల రవీందర్ జ్ఞాపకార్థం ఆమె భార్య చంద్రకళ, వారి కుటుంబ సభ్యులు సింధు దిలీప్, అనూష సాయికిరణ్‌లు గురువారం సామగ్రి అందజేశారు. రూ.30వేలు విలువ చేసే ఎయిర్‌బెడ్, సక్షన్ మిషన్, వీల్‌చైర్‌లను సామాజిక ఆస్పత్రికి రోగుల అవసరాల నిమిత్తం ఉచితంగా పంపిణీ చేశారు. సామగ్రిని అందజేసినందుకు వారి కుటుంబ సభ్యులకు ఆస్పత్రికి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, వైద్యులు రాకేష్, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక ఆస్పత్రికి ఇలాంటి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింగరావు, అలువాల శ్రీనివాస్, ఇర్సవడ్ల సంతోష్, నాగుల రమేష్, మాచర్ల నరేందర్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు

రేగొండ: మండలంలోని రామన్నగూడెంతండాలో గురువారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిరిజన యువతులు తొమ్మిది రోజులు అత్యంత నిష్టగా ఉపవాసాలు చేసి పుట్టమట్టిని తీసుకువచ్చి వెదురుబుట్టలో వేసి, అందులో గోధుమలు పోసి మొలకలు పెంచారు. తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి పెంచిన మొలక బుట్టలను యువతులు నెత్తిన ఎత్తుకుని బాజభజంత్రీల నడుమ పాటలు పాడుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ లచ్చు నాయక్, బాలు నాయక్, వీర్యా నాయక్, యూత్ అధ్యక్షుడు బానోతు రాజేందర్ నాయక్, రాజు, రాహుల్, వినోద్, వెంకట్, నవీన్, యువతులు పాల్గొన్నారు.



తీజ్ ఉత్సవాల్లో గిరిజన యువతులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని సుడిబాక, ఉప్పేడు వీరాపురం గ్రామాల్లో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు స్నేహ, అశీష సోహేల్, సిబ్బంది జ్యోతి తదితరులు ఉన్నారు.

‘ఆదాయానికి, కేటాయింపులకు పొంతన లేదు’



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆదాయం, ఖర్చుకు పొంతన లేకుండా కేటాయింపులకు జరిగాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో 33రకాల పంటలకు బోనస్‌లు ఇస్తామని ప్రకటించారు గానీ రైతులు సాగు చేస్తున్న దొడ్డు వడ్లకు బోనస్ ఉంటుందా లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు బడ్జెట్ కేటాయించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో అంకెల గారడి చేసిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. నాయకులు గాదం కుమార్, కొత్త సురేందర్ ఉన్నారు.

సింగరేణి అధికారుల ఆధిపత్య ధోరణి



సమావేశంలో మాట్లాడుతున్న గట్టయ్య

భూపాలపల్లి అర్బన్: సింగరేణి వ్యాప్తంగా కార్మికులపై యాజమాన్యం ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తుందని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గట్టయ్య మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు కార్మిక సంఘాలకు గుర్తింపు పత్రం రాకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. గెలుపొందిన సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. సంఘ నాయకులు వారి వ్యక్తిగత పనులు మాత్రం యధావిధిగా చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిని ఆసరాగా చేసుకొని సింగరేణి వ్యాప్తంగా అధికారులు కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో గని స్థాయి అధికారులకు చెప్పుకుందామంటే వారు స్పందించడం లేదన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, సంస్థ అభివృద్ధి కోసం సింగరేణి సీఎండీ అన్ని కార్మిక సంఘాల నాయకుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నప్పటికీ ఏరియాలో జీఎం మాత్రం సంఘ నాయకుల అభిప్రాయాలను తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాంటి అధికారులపైన సింగరేణి డైరెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కుమారస్వామి, రాజయ్య, జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, లింగన్న, శ్రీధర్, శ్రీనివాస్, జయశంకర్, విజయ్, సాదిక్ పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యం తగ్గించాలి



మొక్క నాటి నీరుపోస్తున్న జీఎం హబీబ్ హుస్సేన్, అధికారులు

భూపాలపల్లి అర్బన్: మొక్కలు విరివిగా నాటి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ తెలిపారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ ఆదేశాల మేరకు గురువారం వృక్షారోహణ అభియాన్–2024 కార్యక్రమాన్ని భూపాలపల్లి ఏరియాలోని కేటికే ఆరో గనిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం హాజరై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పచ్చదనాన్ని పెంచి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని.. ఇతరులతో కూడా మొక్కలు నాటించాలని కోరారు. పట్టణాలలో ఉన్నవారు ప్రతీ ఒక్కరు కనీసం పండ్ల మొక్కలనైనా నాటాలన్నారు. వాటి నుంచి వచ్చే పండ్లని మనం తినడం వలన ఆరోగ్యంగా కూడా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటరామిరెడ్డి, రాజశేఖర్, రాంబరోస్, తుకారాం, రవికుమార్, సురేఖ, పోషమల్లు, కార్మిక సంఘ నాయకులు రమేష్, బుచ్చయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



గ్రామసభలో మాట్లాడుతున్న సుధాకర్

మల్హర్: గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని మల్లారం గ్రామ ప్రత్యేకాధికారి అత్తె సుధాకర్ అన్నారు. మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వాధులు రాకుండా డ్రెయినేజీలో మురుగు నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని గ్రామంలో పేరుకపోయిన చెత్తా చెదరాన్ని తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. తాగు నీటిలో బ్లీచింగ్ వేయాలన్నారు. స్తంభాలకు నూతన బల్బులు ఫిటింగ్ చేయాలని, గ్రామంలో పశువులో రోడ్ల మీద కట్టేయొద్దని తెలిపారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డేంజర్ జోన్ ఇళ్ల వివరాలు సేకరించాలి



మాట్లాడుతున్న భూ నిర్వాసితులు

మల్హర్: ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలోని మండలంలోని పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లో ఉన్న ఇళ్ల వివరాలు సేకరించాలని తాడిచర్ల భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలో తాడిచర్ల గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిర్వాసితులు మాట్లాడారు. ఫిబ్రవరి 25న ధర్నా చేసిన క్రమంలో నాలుగు నెలల్లో డేంజన్ జోన్ సమస్య పరిష్కరిస్తామని జెన్‌కో సీఈ సిద్ధయ్య హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఆరు నెలలు అవుతున్నా ఇళ్లు తీసుకోవడానికి జెన్‌కో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓపెన్‌కాస్టులతో ఇళ్లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం ప్రధాన కార్యదర్శి అక్కపాక సమ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ తాండ్ర మల్లేష్, భూ నిర్వాసితులు రావుల అంజనేయులు, బొబ్బిలి రాజయ్య, సారంగం సందీప్. పీరయ్య పాల్గొన్నారు.

జూట్ బ్యాగ్ తయారీ శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు అధికారులు

కాటారం: నేషనల్ బ్యాంక్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సహకారంతో అసోసియేషన్ ఆఫ్ లేడి ఎంటర్‌ప్రెనెంట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్‌ల తయారీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. నాబార్డు డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ మేనేజర్ టి.రవి ప్రారంభించి ఉచిత శిక్షణ గూర్చి వివరించారు. 30 రోజుల పాటు మహిళలకు జూట్ బ్యాగుల తయారీ శిక్షణ ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. ట్రైనింగ్‌లో పాల్గొన్న వారికి స్టైఫండ్ రూ.750 ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తయినంతరం సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల మహిళలకు శిక్షణ ఏర్పాటు కోసం నాబార్డు ద్వారా రుణమంజూరు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లవకుమర్, సీసీలు స్వర్ణలత, విజితారెడ్డి, ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ సూర్యదేవర వనిత, ట్రైనర్ అరుణ పాల్గొన్నారు.

దిగబడ్డాయి..



పలుగుల రోడ్డులో దిగబడ్డ స్కూల్ బస్సును నెడుతున్న స్థానికులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి క్రాస్‌రోడ్ నుంచి పలుగులకు వెళ్లే రహదారి వర్షాల కారణంగా మోకాలు లోతు గుంతలతో బురదమయంగా మారింది. గురువారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు రోడ్డుపై బురదలో దిగబడింది. మరోవైపు మండలంలోని పెద్దంపేట వంతెన అవతలి వైపు అప్రోచ్ రోడ్డుపై ఇసుక లోడుతో తరలివస్తున్న లారీ దిగబడింది. ఈ రెండు ఘటనలు వేర్వేరుగా జరిగాయి. ఓవైపు స్కూల్ బస్సు, మరోవైపు ఇసుక లారీలు దిగబడడంతో రోడ్డుపై రవాణా స్తంభించింది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. స్కూల్ బస్సును స్థానికులు తోసి బయటికి తీసి పంపించారు. ఇసుక లారీలతో రోడ్లు ధ్వంసమవుతుఅన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



పెద్దంపేట వద్ద రోడ్డుపై దిగబడిన లారీ